"గంగాధరం బాబూరావుని చితక తన్నేట్ట_"

ప్రపంచంలోని అద్భుతాల్లోకెల్లా అత్యద్భుతమైనట్టు జనమంతా ఆశ్చర్యపోతూ చెప్పుకున్నారు.

మెలి తిరిగిన కోరమీసం _ ఎర్రజీరలు వారిన ఎత్తయిన కనుగుడ్లు _ ఎప్పుడో చిన్నప్పుడు మొహం మీద తగిలిన దెబ్బ బాపతు లోతయిన గంటు _ కండలు తిరిగిన దండలు _ బలిసిన రొమ్ము _ బాబూరావు మదేభ గమనం చూడగానే



# విహ్వల

కాటూరి విజయసారథి

అతను మహా ఘనత వహించిన మల్ల యోధుడని యిట్టే తెలుస్తుంది.

చదువు సంధ్యల్లేకుండా ఆగమ్మకాకిలా తిరుగుతున్నాడని నోరుచేసుకొన్న తండ్రి మీద పంతగించి పారిపోయిన ఇంతప్పటి బాబూరావు_ పాతికేళ్ళ వయసుతో గిత్తలా తయారయి మళ్ళా ఆ ఊళ్లో అడుగుపెట్టాడు. అతను ఏ తాలింఖానాలో తర్ఫీదు పొందాడో_ ఏఏ దేశాలు తిరిగాడో _ ఎందరు వస్తాదుల్ని గెలిచి వచ్చాడో ఎవరూ ఎరగరు. అతను ఊళ్లోకి తిరిగి రావడమే తడవుగా శిష్యకోటి సిద్ధంగా ఉంది. హమేషా పదిమంది జట్టుగాళ్ళు "గురో గురో" అంటూ కైవారాలు చేస్తూ తిరుగుతుంటారు.

అలాంటి బాబూరావుని _ గంగాధరం కొట్టేడంటే ఆశ్చర్యమే మరి_అంత గొప్ప మల్లుని ఎందుకూ కొరగాని బడిపంతులు_ అందులోనూ తెలుగు పంతులు కొట్టేడనేసరికి బాబూరావు శిష్యకోటి కళవళ పడింది. మోతుబరులు "ఔ రా" అనుకున్నారు. విన్న స్త్రీ జనం ముక్కున వేలువేసుకున్నారు. కన్నవారు నోరు తెరచిన విగ్రహాల్లా నిలబడిపోయారు.

గంగాధరానికి అంత సాహసం _ అనంత జవం_ ఎక్కడినుంచి వచ్చాయో అతనికే తెలియదు. ఏదో పౌరుషానికి కొట్టేడన్న మాటేగాని తరవాత అతనెంతగా వణికిపోయాడో అతనికే తెలుసు.

గంగాధరంభార్య, నిండా పాతికేళ్ళ రాని

# విహ్వల

పడుచు. అందమైన పడుచు ప్రొద్దుపేదరికపు మబ్బుచాటున పడినట్లు ఈమె ఎవరో బడి పంతులు భార్య అయి ఉంటుందని చూడంగానే చెప్పటానికి వీలుగా ఉంటుంది. అలమేలుమంగ షావుకారు చక్రపాణిగారింట్లో ఆడపిల్లలకు హిందీ ప్రైవేట్లు చెపుతూ భర్త సంపాదనకు చన్నీళ్ళు కలిపి పొళాలు చేసుకుంటుంది. గుట్టుగా, సంసారం నెట్టుకొస్తున్న అలమేలు బ్రతుకులో ఆ సాయం కాలం అసురసంధ్య. సందె చీకటిపడుతుండగా గంగాధరం బడినుంచి తిరిగివచ్చాక అలమేలు చక్రపాణి గారింటికి బయలుదేరింది. ఎవరో కొందరు చెట్లకింద, చూర్లక్రింద— సాపడి తీరిగ్గా కూర్చుని కబుర్లు చెప్పుకోటమేగాని రోడ్డుమీద పెద్ద రద్దీలేదు. అలమేలు ఇల్లుదాటి నాలుగడుగులు ఇవతలికి వచ్చిం తరవాత బాబూరావు వెంటపడ్డాడు. మలుపుదాటి రెండడుగులు వేసింది. వెనక వినిపించిన సకిలింపు బాబూరావు దేనని దృఢపరచుకొనేసరికి ఆమెకు పైప్రాణాలు పైనే పోయినాయి. అదిరిపడే గుండెను పుస్తకాలతో అదిమి పట్టుకుని చకచకా నడవసాగింది.

"మంగా! మాట—" ఆమె కొక్కదానికే వినిపించేలా పిలిచాడు వెనక నడుస్తున్న బాబూరావు. ఆమెకా పిలుపు వినిపించనట్లే వంచిన తల ఎత్తకుండా విసవిసా నడుస్తున్నది అలమేలు.

"నిన్నే! ఏమిటా తొందర—"అన్నాడు మళ్ళీ. అలమేలు ఉలకలేదు. ప్రొద్దుటలేచి ఎవరి ముఖం చూశానో అనుకుంది. దేవాలయం మలుపు తిరిగితే ఆ సందు చివర్నే షావుకారు చక్రపాణిగారి ఇల్లు. దేవాలయం సమీపించింది. ఒక్కఅడుగు ఆగి—రోడ్డుమీదనుండే అమ్మవారికి మొక్కుకున్నది.

"నిన్నేనే—పిలిస్తే పలక్కుండా పోతన్నావే!"

"ఎందుకో అంత పొగరు —— దేన్ని చూసుకుని?"

"ఆగమంటే——"

బాబూరావు తరుముకొస్తున్నాడు. గుడి గోడనీడ అలమేలుమీద పడింది. ఒక్కఅదటున బాబూరావు ముందుకొచ్చి —— "భయమేస్తోందా! ఫరవాలేదులే—నీ మొగుడికి తెలియనివ్వన్లే —— తెల్సిస్తే మాత్రం ఆడేం చేస్తాడే?" అంటూ ముందుకొచ్చాడు.

దడదడలాడే గుండెతో —— మారుపలక్కుండా —— ఒడుపుగా తప్పుకుంటూ—— నడుస్తోంది.

"మరియాదగా ఒప్పుకోవు కాదూ?— మాట్లాడవేం?—మూగదానివా?—ఒసే మంగీ" అంటూ బాబూరావు అలమేలు చేయిపట్టుకున్నాడు.

"ఛీ! వదులు—వదలమంటే" అని విదలించి పారేసింది. ఆ క్షణాన ఆమెలో భయం —దుఃఖం—అసహ్యం—ముప్పిరిగొని సాహసం మాటున దాగొన్నాయి.

మసకచీకటిలో బండి వస్తున్న ఎడ్లమెడ గంటలూ—ఎద్దుల నదిలించే కాపుగొంతూ—వినిపించి ఉండకపోతే బాబూరావు వెనకడుగువేసి ఉండేవాడు కాదు. "పో! ఎక్కడికి పోతావులే" అంటూ భయంకరంగా—కసిగా—అన్నాడు.

అలమేలు అమాంతం షావుకారు ఇంట్లో పడ్డది. షావుకారు భార్య వర్ధనమ్మ అక్కున జేరి వలవలా విలపించింది.

వర్ధనమ్మ అలమేలును గుండెల కదుముకుని సంగతేమిటని అడిగి తెలుసుకుంది. "ఊళ్లో ఎందరికైనా చావొస్తోందిగాని ఆ దిక్కుమాలిన చచ్చినవాడికి రాకుండాఉంది; పట్టుమని పదిమంది లేరు—ఆ రౌడీమూకను కట్టిపడేసే వాళ్ళు లేకపోయారు....ఎందుకున్నారు— మళ్ళా తెగబారెడేసి మీసాలు దువ్వుకుంటూ —ఊరుకోమ్మా ఊరుకో—" అని ఓదార్చింది.

భార్య మాటలకు సగం చచ్చిన షావుకారు —ఏమీ అనకపోతే అలుసైపోతామన్నట్లు— "అయినా ఈ హిందీలూ సందె చదువులూ వద్దంటే నువ్వివన్నావ్ —అసలే రోజులిట్లా ఉంటే ఎందుకొచ్చిన చదువులు చెప్పు....? చూడమ్మా —— ఇహనించీ నువ్వు సాయంత్రంపూట మాత్రం ప్రైవేటు చెప్పటానికి రాబోకు, నీకుకుదిరితే పొద్దుటి పూట వచ్చి నాలుగు ముక్కలు చెప్పుకో—" అన్నాడు అసహాయునిలా హితవు చెబుతూ. షావుకారు పాలేరువాడిని తోడిచ్చి అలమేలును ఇంటికి పంపించేడు. వర్ధనమ్మ సానుభూతికీ, షావుకారు హిత వచనాలకీ ఆమెలోని పరాభవ కీల చల్లారలేదు. ఇంటికిపోయి మొదలు విరిగిన మానులా మంచం మీదపడి భోరున ఏడ్చింది. గంగాధరం పజ్జజేరి ఎందుకో చెప్పమని సానునయంగా అడిగాడు. పెల్లుబుకుతున్న దుఃఖాన్ని అణచుకొంటూ— వెక్కుతూ— చెప్పింది.

అవమాన బల్లెం గంగాధరం గుండెల్లో గుచ్చుకుంది. చూస్తాను— వీడి దుండగాలకు అంతులేకుండా ఉంది. పోయిన నెల పూజారి చెల్లెల్ని — వాడి జట్టుగాళ్ళు అంతా కలిసి— అర్ధరాత్రికి అర్ధరాత్రి —— ఆరు బయట పడుకున్నదాన్ని— మంచంతో పాటు మాయం చేశారు. అది గుండె పగిలి చచ్చినా ఎవరికీ పట్టలేదు...." గంగాధరం ఆవేశపడుతూ అస్తిమితంగా అన్నాడు.

ఆరుబయట పడుకున్న పూజారి వీరేశలింగం చెల్లెల్ని ఎవరో ఎత్తుకుపోయారు. దేవుణ్ణి నమ్ముకున్న పూజారీ, పొట్ట చేత పట్టుకుని కాని ఊళ్లో తల దాచుకొంటున్న తానూ ఏమీ చేయలేకపోయారు. అంత ఘోరం జరిగిపోతే ఎవరికీ చీమ కుట్టలేదు. గంగాధరానికి మళ్ళా ఆ దృశ్యమంతా కళ్ళముందు పటం కట్టింది.

"వీల్లేదు. ఎలాగైనా సరే వీడికి గుణపాఠం చెప్పితీరాల్సిందే. ధర్మం నశించిపోయిందా— ఊళ్ళో పెద్ద మనుషులు చచ్చిపోయారనుకున్నాడా— ఏమంటారో తెలుసుకుంటాను—"వీరావేశంతో పంతులు పరవళ్ళు తొక్కేడు. ఆ క్షణాన తన భర్త ఏ అఘాయిత్యం చేసినా చెయ్యగలడని అలమేలు భయపడ్డది. బుద్ధి గడ్డితిని చెప్పాననుకున్నది. "వద్దులెండి—ఇంతకీ నారోజు మంచిదికాదు. మీరేం చెయ్యఖర్లేదు. ఏదో బుద్ధి తక్కువై చెప్పాను—అని వారించింది. "లేనిపోని పౌరుషాలకుపోయి నా కొంప ముంచకం"డని బ్రతిమాలుకున్నది. "తెల్లవారేసరికి మనం ఈ ఊరు విడిచి పెట్టి వెళ్ళిపోదాం—చేతనయితే అందుకు వలసిన ఏర్పాట్లు చేయ"మని ప్రార్థించింది.

"చేస్తాను—అన్ని ఏర్పాట్లు చేస్తాను—ఇప్పుడే చేస్తాను" అంటూ బజారున పడ్డాడు గంగాధరం.

నాలుగు వీథుల నడుమ—కిల్లీ బడ్డీముందు —చాపలు పరచి కూర్చున్నారు జనం. కొందరు క్రొత్తగా వెలసిన కరెంటు దీపాల క్రింద తీరిగ్గా చీట్లాడుకుంటున్నారు. అప్పుడే తినివచ్చిన పంచాయతీ బోర్డు ప్రెసిడెంటు సిగరెట్టు కాల్చుకుంటూ చుక్కల్లోకి చూస్తూ రాజకీయాలు మాట్లాడుతున్నాడు. ఓటుగలవాళ్ళంతా ఆ మహానాయకుడి లోకాభిరామాయణం ఆలకిస్తున్నారు. గంగాధరం నేరుగా వచ్చి పదిమందిలో నిలబడి—ఎంతో ఉద్రేకపడిపోతూ జరిగిందంతా చెప్పాడు.

ప్రెసిడెంటు ఏమీ సమాధానం చెప్పలేదు.

తన కంతకుముందు ఈ సంగతే తెలియనట్లూ—అప్పుడే గంగాధరం ముఖతః ప్రప్రథమంగా వింటున్నట్లూ ఆశ్చర్యాన్ని నటించాడు షావుకారు.

పెద్దలున్నారు — మనకెందు కన్నట్లు భక్తులూ, వందిమాగధులూ నిరుత్తరులై కూర్చున్నారు.

"ప్రెసిడెంటుగారూ! తమరు పెద్దలు— మీరే వీడికేదైనా బుద్ధి చెప్పాలి. ఇల్లాంటి ఘోరాలు జరిగిపోతుంటే మీలాంటివారిలా ఉపపేక్షిస్తే ఎలా చెప్పండి—" అన్నాడు మళ్ళా గంగాధరం.

"ఇంతకీ నన్నేం చెయ్యమంటా వయ్యా?" ఏమీ పట్టించుకోదలచనట్లూ— తా నేమీ చేయలేనన్నట్లూ—ఈ దిక్కుమాలిన కేసులు విచారించటానికా తాను ఇన్ని వేలూపోసి ఎన్నికల్లో నెగ్గటం అన్నట్లూ—అదో మాదిరిగా అన్నాడు ప్రెసిడెంటు.

"మీరు సమర్థులు— తలుచుకుంటే ఏదైనా చెయ్యగలరు—" అన్నాడు బడి పంతులు.

"ఇంకేం— నువ్వుకూడా ఓ పోలీసు రిపోర్టు రాసిపడెయ్" అని సలహా యిచ్చాడు ప్రెసిడెంట్— ఆ పైన నేను నాన్నగా అన్నట్లు.

"ఊరుంది. ఊళ్ళో ఇందరు పెద్ద లున్నారు. నేను పోలీసు రిపోర్టు ఇచ్చి మీ కందరికి తలవంపులు తీసుకొస్తానా ప్రెసిడెంటుగారూ! ఒక వేళ నేను పోలీసులకి చెప్పుకుంటే మాత్రం మీరు చేయలేనిది. వాళ్ళు మాత్రం ఏం చేస్తారు చెప్పండి—" అన్నాడు గంగాధరం.

"భలేవాడివయ్యా పంతులుగారూ! పోలీసులు చెయ్యలేని పని నావల్ల అవుతుందా! అతగాడేమో చెయ్యట్టుకు లాగింది నీ పెళ్ళాన్ని? నువ్వేమో పోలీసురిపోర్టుపడెయ్యవూ? మధ్యన మేం కలిపించుకొని కొరివితో తల గోక్కోవాలా? భలేబాగుంది తెలివిలో ముందు నిన్ను చెప్పి ఇంకోళ్ళని చెప్పాలి" అన్నాడు ప్రెసిడెంటు అవహేళనగా.

"ప్రెసిడెంటుగారి మాటే నిజం" అక్కడున్న యావన్మందీ ఆయనను అనుసరిస్తూ నవ్వేరు. ఆ నవ్వులకు గంగాధరం బిక్కవోయాడు. ప్రతీకార చింతనతో గంగాధరం ఏమో ఆలోచించాడు. అంతలో బాబూరావు వస్తున్న జాడచూసి అక్కడ ఇంకెవ్వరూ ఆ ప్రసక్తే ఎత్తలేదు. ఎవ్వరి మట్టుకు వారు మౌనంగా కూర్చున్నారు. ఏం కర్తవ్యమని గంగాధరం తుకతుకలాడిపోతున్నాడు అక్కడ జేరిన పెద్దలమీదా— తన చుట్టూ ఉన్న సంఘమర్యాద పైనా అంతులేని అసహ్యం. తీవ్రమైన నిరసన కలిగాయి.

బాబూరావు బడ్డీలోకి వెళ్ళాడు. వెడుతూ ఒక్కసారి గంగాధరం మొహంలోకి వాడిగా చూసి వెళ్ళాడు. ఆ చూపు గంగాధరానికి కాలు నిలవనీయలేదు. లోలోపల కొట్టు మిట్టాడుతున్నాడు.

కిళ్ళీ నములుతూ బాబూరావు బడ్డీలోంచి బయటికి వచ్చాడు. వస్తూ— ఇంకోసారి విజయగర్వంతో గంగాధరం ముఖంలోకి చూశాడు. గంగాధరం ఆకలిగొన్న పులిలాగా — పొంచిఉన్న క్రూరసర్పంలాగా ఒక్క ఉదుటున బాబూరావు మీది కురికి మాట్లాడకుండా టపటపా వాయించేశాడు.




కసితీరక కడకు ముక్కుమీద బలంగా ఒక్కగుద్దు గుద్దేడు. ఆ దెబ్బకు బాబూరావు ముక్కున నెత్తురు పారింది..

'జాగ్రత్త! ఈ సారి ఇలాంటి పనిచేశావంటే — నిన్ను భస్మంచేస్తాను — ఫో" రొప్పుతూ—రుద్ధకంఠంతో అన్నాడు గంగాధరం. జనమంతా ఒక్కసారి లేచి నిలబడ్డారు. ప్రెసిడెంటు తత్తరపడ్డాడు. ఈ హఠాత్సంఘటనకు బాబూరావు నిర్విణ్ణుడయ్యాడు. అతని పరివారం వెలతెలపోయారు.

"నీ కడ్డు లేదనుకుంటున్నావేమో! ప్రజలు గాజులు తొడిగించుకున్నారనుకుంటున్నావేమో — తిన్నగా బ్రతకదలుచుకుంటే నీతిగా నడుచుకో-ఇంకా నిల్చున్నావేం—ఫో" అంటూ లేనిపోని గాంభీర్యంతో మళ్ళా అతనిమీద కురకబోయాడు కాని—అంతలో—లేచిన జనం కలగజేసుకొని "పంతులుగారూ, మీరు కాస్త శాంతించండి — మేమంతా లేమూ — మీకవమానం జరిగితే మాకు జరిగినట్టు కాదూ! మాతో మాటమాత్రం చెబితే ఈ విషయం ఇంత దూరం రానిచ్చేవాళ్ళమా. కాస్త మీరు సావధానంగా కూర్చోండి—"అంటూ అతన్ని ఇవతలకి తీసుకొచ్చారు.

బాబూరావు బిక్కచచ్చిపోయాడు.

ఆవేశంతో, భయంతో గంగాధరం గడగడలాడిపోతున్నాడు.

ముక్కు అదరగా కారిన నెత్తురు తుడుచుకొంటూ — తలవంచుకు వెళ్ళిపోయాడు బాబూరావు. అతని పరిజనం మౌనంగా అతని వెనకే నడిచిపోయారు.

బాబూరావు వెళ్ళిపోగానే జనం ఒక్కసారి ఊపిరి పీల్చుకున్నారు. తలవని తలంపుగా జరిగిన ఈ సంఘటనతో వారిముఖాల మీద నీరెండ కాసినట్లయింది. ప్రెసిడెంటు గారి పలుకుబడికి వెరచి ఎవరూ పైకి అనలేకపోయినా హృదయాంతరాళంలో "బాగా అయింది"అనే హర్షించారు. గంగాధరం ముఖంలో విజయగర్వం తొంగి చూసింది. ప్రెసిడెంటు వచ్చి "భేష్—సెభాషైన పనిచేశావు పంతులుగారూ— నువ్వేం భయపడకు— మేమంతాలేమూ" అని గంగాధరాన్ని తప్పనిసరిగా—మర్యాదకు అభినందించాడు.

ఆ లిప్తలో గంగాధరానికి బాబూరావు మీద కలిగిన క్రోధాన్ని మింగేసేటంత అసహ్యం—ఆ ప్రెసిడెంటుమీదా—అక్కడ జేరిన జనంమీదా కలిగి— మరోక్షణం అక్కడ నిల్చున్నా మహాపాపం అంటుకుంటుందన్నట్లు ఇంటికి వెళ్ళిపోయాడు.

* * *

గండరించిన ముఖంతో ఇంటికొచ్చిన గంగాధరానికి ఒక దుష్టుని పొగరణచిన తృప్తికంటే ప్రాణభయం ఎక్కువై అస్తిమితంగా ఉన్నాడు. అర్ధరాత్రి అవుతున్నా అతనికి నిద్రపట్టలేదు. అలమేలు మాటసరేసరి. కళ్ళల్లో వత్తులు వేసుక్కూర్చున్నది. మగవాడు గనక గంగాధరం నిబ్బరంగా ఉండక తప్పలేదు.

"తెలిసి తెలిసి ఆ దుష్టుడి జోలికెందుకెళ్ళారు చెప్పండి. తాచులా పగబట్టి ఇంతకింత దెబ్బ తియ్యక ఊరుకొంటాడా? ఉరిసిన పుండుమీద ఉప్పు చల్లి వచ్చారు—" ఏడ్చి ఏడ్చి బొంగురువోయిన గొంతుతో అన్నది అలమేలు.

"పోనిద్దు మంగా, జరిగిందేదో జరిగింది ఇహ ఆ గొడవ మానేసి యేవైనా రెండు మంచిమాటలు చెప్పు" బాబూరావుని గురించిన ఆలోచనతో బుర్ర వేడెక్కిపోయి—విసిగిపోయి—చావడానికి సంసిద్ధుడైనవానిలా అన్నాడు గంగాధరం.

"మీకేం పట్టలేదు. నా కొంపమీదికితెచ్చి పెట్టారు. ఇది మీకు న్యాయమా చెప్పండి" ఇంకా ఎక్కడో మిగిలి పొంగుతున్న దుఃఖంతోఅన్నది.

ఒక వంక బాల హరిణి వంటి అలమేలు —ఇంకొక వంక బెబ్బులి లాంటి బాబూరావు— క్షుద్ర జంతువుల్లాంటి ప్రెసిడెంటూ, షావుకారూ — ఎక్కడో దూరాన — చచ్చిపోయిన పూజారి చెల్లెలూ — విలవిల లాడిపోతూ—వికటాట్టహాసం చేస్తూ—పరిదీన వదనంతో— అతని ముందు బొమ్మకట్టి నిలబడ్డారు. వీళ్ళందరి మధ్యా బడుగులా తాను భోరున ఏడుస్తున్నట్లనిపించింది. పీడ కలలాంటి ఆ దృశ్యంలోనే అలమేలు వెక్కివెక్కి విలపించటం వినిపించి— "ఊరుకో మంగా! మనం చెయ్యవలసింది చేశాం— ఇహ నిప్పుడు చెయ్యగలిగిందీ లేదు. ఏడ్చి అంతకంటె లాభం లేదు—" అన్నాడు ఓదార్పుగా.

"ఆ బాబూరావు ఊరుకొంటాడా?"

"ఊరుకోడు— ఇప్పుడో ఇంకాస్సేప

(మిగతా 38 వ పేజీ చూడండి)

# విహ్వల

(31 వ పేజీ తరువాయి)

టికో యమ కింకరుడై వస్తాడు. నన్ను అంతం చేస్తాడు. అందుకని—? ఎవడో రౌడీ వెధవ దారినపోయే ఇల్లాలిని చేయిపట్టి లాగితే – ఎందుకూ పనికిరాని దద్దమ్మ లాగా ఊరుకోమంటావా? ఊరుకొని బ్రతకటంకంటె ప్రతీకారంచేసి చచ్చిపోవటం మంచిది. లేదు మంగా లేదు.... అనాలోచితంగా చేసినా చాలా సమంజసంగానే ప్రవర్తించాను ఎలా జరగాలో అలా జరుగుతుంది. ఒకవేళ నువ్వనుకొన్నట్టు ఈ రాత్రే మనకు చివరిరాత్రి అయితే — మనకు మిగిలిన ఈ ఒక్కరాత్రీ ఇలా బెంబేలు పడిపోతూ వృధాపుచ్చటం వెర్రితనం. ఇలా రా మంగా—" అంటూ అలమేలును దగ్గరకు తీసుకున్నాడు గంగాధరం. ఆమె అతని గుండెమీద వ్రాలిపోయింది. ఆమె కురులు నిమురుతూ కన్నీటి చారికలు తుడుస్తూ "మంగా! నేను వీరుణ్ణి – కాదూ?" అన్నాడు తెచ్చికోలు వికాసంతో దుఃఖపు పెల్లుని ఎగబీలుస్తూ. బలవంతపు నవ్వుతో – ఔ నన్నట్లు తల ఊపుతూ అతని అక్కువ ఒరిగిపోయింది. అలమేలు.

* * *

మహాత్ములూ, మహర్షులూ గతించిన పుణ్యభూమి మీద గంగాధరంవంటి బడిపంతుల్ని రక్షించేపాటి ధర్మం కరువైపోయింది. ఊరంతా భళ్ళున తెల్లారిపోయినా చెరువైపోయిన అలమేలుమంగ కన్నీరు తుడిచేందుకు మరో కరుణామయి కనిపించకపోయింది. కన్నతల్లి కనుక బిడ్డకు కలిగిన కడివెడు దుఃఖాన్ని కడుపులో పెట్టుకుని ఓదార్చక తప్పలేదు. మరో మూడోవ్యక్తి ఎవ్వరూ ఆ యింటివేపు కన్నెత్తి చూడలేదు.

పదింటికిమామూలుగానేహైస్కూలుకు పిల్లలు వెళ్ళిపోయారు. స్కూల్లో జాతీయ పతాకం గంగాధరం మరణానికి సిగ్గుపడినట్లు ముఖం ముడుచుకొని తలవంచుకుంది.

బడివిడిచి వచ్చిన విద్యార్థి యోధులు బాలచంద్రులై ఊరిమీద విరుచుకుపడ్డారు. ఆర్భటులతో— పెడబొబ్బలతో— అర్భకుల నినాదాలతో ఊరు ఊగిపోయింది. ఈ మహార్ణవ సంక్షోభానికి కారణం ఏమిటా అని ఆత్రంతో పిల్లల్ని కన్నతల్లులు కిటికీలు తెరిచి ఆశ్చర్యంగా చూస్తున్నారు. కొందరు తండ్రులు తమ బిడ్డల్ని వారించటానికి ప్రవాహం ముందు నిలచి పిలిచారు.

సమూహంలో ఎక్కడినుంచో రాళ్ళవాన పడగానే తలవంచుకు తప్పుకున్నారు. మరికొందరు తల్లులు తండ్రులు—మేడమీద నిల్చుని—"నాయనా బాబ్జీ! వచ్చెయ్"

"రామూ! నువ్వొచ్చేసెయ్" అంటూ కేకలు పెట్టటమే గాని – వారి పిలుపులు ఒక్కరికీ చెవికెక్కలేదు. తల్లిదండ్రుల ఆరాటంతో ఆ పిల్లలకి పనిలేదు. రాజకీయాల్లో తలనెరసిన కుతంత్రాలు వాళ్ళకి అర్థంకావు. బాబూరావుకి ఉన్న పలుకుబడి విలువ వాళ్ళెరగరు. పదిహేనువేల జనాభా ఉన్న ఆ ఊళ్లో ప్రతి వెయ్యిమందికీ పది సారాబట్టీలున్న సంగతి – ఆ సారాపాకల యజమానులు— వాటిని పోషిస్తున్న మహారాజ పోషకులూ— బాబూరావు గీచినగీటు దాటరనీ— వారివారి ఓటులన్నీ బాబూరావుకి పెట్టనికోట లనీ— బాబూరావు ప్రెసిడెంటు ఎన్నికలకీ– షావుకారు వ్యాపారానికీ తవ్వని అగడ్త అనీ–పసివాడు ప్రెసిడెంటుగారి కొడుక్కి– ఎలా తెలుస్తుంది. వట్టి ఆవేశంతో ఊరేగింపుకి మొదటివాడుగా నాయకత్వం వహించడమే అతనికి తెలిసిన వీరం. సుడులు తిరుగుతూ, పరవళ్ళు తొక్కుతూన్న ప్రవాహం– సరాసరి పోయి— గంగాధరం మాస్టారి ఇంటిముందు ఆగిపోయింది.

శోకరూపిణి అయిన అలమేలుమంగలో ఆ మహాచైతన్య స్రవంతి ఎలాంటి సంచలనాన్ని కలిగించలేదు. ఆమె తల్లి మాత్రం ప్రేతానికి చేయవలసిన దహన సంస్కారాలు చేయించమని పిల్లల్ని కోరింది. పిల్లలు ఊరిమీద పడి రకరకాల పూల మొక్కలను కొమ్మలతో విరిచి, వేళ్ళతో పెరకి తెచ్చారు. కొందరు పురోహితుణ్ణి పిలక పుచ్చుకొని ఈడ్చుకొచ్చారు. కట్టెల అడితీలో ఎండుకట్టెలు బళ్ళకెత్తి వల్లకాటికి తోలేరు. మరికొందరు ఊళ్లో ఉన్న బేండుమేళాన్ని పిల్చుకొచ్చారు. విద్యార్థులే శవ వాహకులుగా ఊరేగింపుతో అంత్యక్రియలు చేశారు. పురోహితుడు మంత్రాలే చదివాడో– మాయమే చేశాడో నయాపైసా ఖర్చులేకుండా గంగాధరం కట్టె తట్టెడు బూడిదగా మారిపోయింది. వల్లకాటిలో పుట్టిన దహనాగ్నుల పొగలు గూడెంచుట్టూ అలముకొన్నై. అర్థహీనులూ—ఆకలిమంటలవారూ శివమెత్తి విద్యార్థుల్లో కలిసిపోయారు. "బాబూరావ్ డౌన్ డౌన్" "గంగాధరం మాస్టార్.... జోహార్" అంటూ పిల్లలూ పెద్దలూ ఊరిమీదపడ్డారు. ఈ సంక్షోభంలో అరటిపళ్ళ అంగళ్ళు అల్లల్లాడినై. బియ్యపుకొట్లు బిత్తరపోయినై. మిఠాయి దుకాణాలు మట్టిపాలుకాగా చీకటికొట్లలోచివుకుతున్నపంచదార ఊరి చెఱువులో కరిగిపోయింది. పిరికిగుండెలు తలుపులు మూసుకున్నై. పిల్లి లేవని ప్రతిపొయ్యీ ఆనాడు కణకణమండింది.

ఊరు ఊరంతా వెదికినా బాబూరావు జాడ తెలియలేదు. అతని జట్టుగాళ్ళు జబ్బమనుషుల్లాగా వెలుగుముఖమే చూడలేదు. "అదుగో నా రౌడీ"—చేలగట్లకి అడ్డంపడి పరుగెత్తుతున్న బాబూరావుని గుర్తుపట్టిన ఎవరో ఒక్క అరుపు అరిచాడు. పిచ్చెత్తిన చిరుతపులుల్లాగా విద్యార్థులు అటు పరుగెత్తారు. బాబూరావు గడగడలాడిపోయాడు. "రౌడీ బాబూరావు నశించాలి" అనే నినాదాలు అతని ఆక్రోశాన్ని వినిపించుకోలేదు. ఆ పిల్లలముందు బాబూరావు గుంజీలు తీశాడు. ఫెళ్ళున చెంపలు వాయించుకొన్నాడు. ఒంటికాలిమీద చెరువు గట్టువరకూ కుంటించారు. ఊరి చివర మర్రిఊడలకు కట్టిపడేశారు బాబూరావుని.

"ఎండు తాటాకులు తెండిరా — సజీవ దహనం చేద్దాం"

"వీడా రౌడీ!"

"ఏరా రౌడీ—ఒణికిపోతా వెందుకురా?"

"నీ మొహానికి మాస్టారి భార్యమీద మనసైందా! పాపం!"

జుట్టుపట్టుకు గుంజేవాళ్ళు—

మొహంమీద ఉమ్మేసేవాళ్ళు—

చెప్పుదెబ్బలతో చెంపలు ఛెళ్ళుమనిపించేవాళ్ళు—

ఎడం కాళ్ళతో తన్నేవాళ్ళు—

బండబూతులు తిట్టేవాళ్ళు—మంటి బెడ్డలు విసిరేవాళ్ళు— వాళ్ళకెందుకు బాబూరావు కన్పిళ్ళు?

పసుపుకుంకుమ కరవైనఊళ్లో-ఆదరణ అడుగంటిన ఇంట్లో—మొహమెత్తుకు తిరగలేక—తలదాచుకుని ఉండలేక – కన్నతల్లి మాటున— పైటచెంగు చాటుచేసుకుని— ఎవరూ చూడని కాలిదారిని వెళ్ళిపోతోంది. కాని, ఆమె అలా కానిదారిని పోవడం కోటికళ్ళు కనిపెట్టినై శతకోటి కంఠాలు ఎలుగెత్తి పిలిచినై.

అలమేలు పలకలేదు.

సుడిగాలికి ఎగిరిపోతున్న పండుటాకులా వెళ్ళిపోయింది— అందరూ చేష్టలు దక్కి ఆమెవేపే చూస్తూ నిలబడ్డారు. కనుమరుగైపోతున్న నిశ్చల దీపకళికలా అలమేలు వెళ్ళిపోయింది.

"బాబూరావ్ డౌన్‌డౌన్" అని మిన్నుముట్టే నినాదాలు క్రమక్రమంగా ఊరి దెసగా విలీనమైపోయాయి. ★

